



హైదరాబాద్ వార్త

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ

# కళ్యాణ మహోత్సవం

- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- మంత్రి పొన్నం,మేయర్ గద్వాల ప్రోటోకాల్ వివాదం
- అలిగి ఆలయం బయట ఫుట్‌ఫాత్‌పై కూర్చున్న మంత్రి పొన్నం
- తాను అమ్మ వారి భక్తుడినంటూ వివరణ

**బేగంపేట జులై 9,ప్రభాతవార్త**

భక్తుల కోరిన కోర్కెలు తీర్చే బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం మంగళవారం అంగ రంగ వైభవంగా నిర్వహించారు.ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని,వర్షాలు విస్తారంగా కురియాలని,కోరుకుంటూ లోక కళ్యాణార్థం అమ్మ వారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవాన్ని కన్నులారా వీక్షించేందుకు పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు,కేంద్రమంత్రులు,మంత్రులతో పాటు మేయర్, ఎమ్మెల్యేలు,ఇలా ప్రతి ఒక్కరూ అమ్మ వారి కళ్యాణంలో పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు పొందారు.ఈ వేడుకను తిలకించేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలు దేశం లోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో పాటు శివసత్తులు వచ్చి అమ్మ వారికి బోనాలు సమర్పించారు.అమ్మ వారికి 27 చీరెలు,స్వామి వారికి 11 పంచెలతో అలంకారం చేసారు.స్వామి,అమ్మ వార్ల కళ్యాణ మహోత్సవాన్ని కన్నులారా వీక్షించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు బల్కంపేట ఎల్లమ్మ అమ్మ వారిని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి దర్శించుకున్నారు.హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.కళ్యాణానికి హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి హాజరయ్యారు. వీరిద్దరు అమ్మ వారి దర్శనానికి వచ్చిన సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు సాధారణ భక్తుల్లా క్యూలైన్లలో వేచి ఉండటం, ఆతర్వాత వారు అలకబూని ఆలయం వెలుపల ఫుట్‌ఫాత్‌పై కూర్చునడంపై మీడియాతో పాటు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పై మంత్రి







పొన్నం అసహనం వ్యక్తం చేసారు.మరికొద్ది సేపు తాము క్యూలైన్లలో ఉంటే ప్రాణాలు పోయేవని,తమ పరిస్థితే ఇలా ఉంటే ఇక సాధారణ భక్తుల పరిస్థితి ఏంటంటూ ఆయన కలెక్టర్ పై తీవ్ర అసహనం వ్యక్తం చేసారు.ఈ సమయంలో స్వల్ప తోపులాట కూడా చోటు చేసుకోవడంతో ప్రోటోకాల్ పాటించలేదంటూ మంత్రి పొన్నం,మేయర్ గద్వాల విజయలక్ష్మిలు అలిగి బయటే కూర్చున్నారు.ఇది పెద్ద హాట్ టాపిక్ గా మారింది.అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ తాను ఎల్లమ్మ తల్లి భక్తుడినని,నేను అలగలేదని,మహిళలు ఇబ్బందులు పడుతున్నారని,అక్కడ (బయట) కూర్చున్నామని, పరిస్థితులు చక్కదిద్దడానికే అక్కడ (బయట) కూర్చున్నాం.అధికారం హోదా తోటి రాలే.భక్తులుగా వచ్చామంటూ పొన్నం పేర్కొన్నారు.ఐపీఎస్ అధికారి ఉండి అన్నీ చక్కదిద్దాలి.మ్యానేజ్ మెంట్ లోపం జరిగింది.మేయర్ కిందపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. మహిళలు ఇబ్బందులు పడితే బాధ్యతగా సీరియస్ అయ్యాను.తోపులాట నివారించేందుకు కొద్దిసేపు ఆగాము.మహిళా రిపోర్టర్‌కి ఎదురైన చేదు అనుభవానికి క్షమాపణ చెబుతున్నాం.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం.కళ్యాణం అద్భుతంగా జరిగిందంటూ మంత్రి పొన్నం వివరించారు. అనంతరం బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం సందర్భంగా జరిగిన అవాంఛనీయ సంఘటనలపై దేవాదాయ,ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్,దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్,కమీషనర్ హన్మంతరావు,జీహెచ్ఎంసీ కమీషనర్ ఆమ్రాపాలి.హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,నగర పోలీస్‌కమీషనర్ కొత్త కోట శ్రీనివాసరెడ్డి,బల్కంపేట దేవాలయ ఈఓ .రాష్ట్ర స్థాయి బోనాల కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ నేడు బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవంలో జరిగిన తోపులాట వెనుక కుట్రకోణం ఉందని మంత్రి అన్నారు. ఈ ఘటనపై పోలీసశాఖ విచారణ చేస్తుందన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని మంత్రి అధికారులను ఆదేశించారు.పోలీస్‌శాఖ రేపటిలోగా ఈ సంఘటనపై నివేదిక సమర్పించా లని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

## అవినీతిలో రికార్డు సృష్టిస్తోన్న కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ, డీఇ కార్యాలయాలు

### -ముడుపులిస్తేనే ముందుకు కదులుతున్న ఫైళ్ళు -టెండర్లలో భారీ అవకతవకలు

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జూలై9, ప్రభాతవార్త**

జిహెచ్ఎంసి కూకట్‌పల్లి జోన్ సూపరిండెంటింగ్ ఇంజనీర్(ఎస్ఈ) కార్యాలయంతోపాటు సర్కిల్ 24 డీఇల కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న కొందరు అధికారుల అక్రమాలకు అంతే లేకుండా పోయింది. ఎస్ఈ కార్యాలయంతోపాటు డీఇలు, ఏఇల కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమ వసూళ్ళపై అటు ఏసీబీ గాని ఇటు విజిలెన్స్ విభాగాలు దృష్టిసారించకపోవడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తమ కింద పనిచేసే ఏఈలతోపాటు వర్క్ఇన్స్‌పెక్టర్లతో అందిన మేరకు దండుకుంటున్నారు. టెండర్లు పూర్తయిన తర్వాత ఆయా పనులు మంజూరు చేసే సమయంలోనే పరెṣ్సంటేజీలను నిర్ణయిస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని కొందరు అధికారుల అవినీతి చర్యలకు అడ్డుకట్టపడడంలేదు. ఎస్ఇ, డీఇలు కార్యాలయాల్లో ముడుపులు ఇస్తేనే ఫైళ్ళు ముందుకు కదులుతున్నాయి. ఎస్ఈ కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ అధికారి ఇంజనీరింగ్ నియమ నిబంధనల్ని అమలు చేయకపోవడం వల్ల జిహెచ్ఎంసికి రూ.కోట్ల రూపాయల నష్టం వస్తోంది. రూ.కోట్ల విలువచేసే అభివృద్ధి పనులకు నిర్వహించే టెండర్లలో పెద్దఎత్తున అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపనలు ఉన్నాయి. ఇక డీఇల కార్యాలయాల్లో తమ వద్దకు వచ్చే ఏ పనికైనా పెద్ద మొత్తంలో మామూళ్ళు ఇవ్వనిదే ఫైళ్ళు కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్ఈ కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారితోపాటు డీఇల కనుసన్నల్లో కొన్ని రూ.కోట్ల విలువ చేసే టెండర్లలో పెద్దఎత్తున అవకతవకలు, గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారులకు రాజకీయ అండదండలతోపాటు జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఉన్నతాధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో కొందరు తమ ఇష్టారాజ్యంగా అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా పనుల మంజూరుకు సంబంధించిన ఫైళ్ళను సకాలంలో క్లియర్ చేయకుండా తాము అడిగినన్నీ మామూళ్ల ఇచ్చేంత వరకు సదరు అధికారులు క్లియర్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయినపల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో నాన్యతలేకపోవడంతో వేసినా కొన్నినెలలకే రోడ్లు అద్వాన్నంగా తయారయ్యాయి. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనుల్ని చేపడుతున్నప్పటికీ కొందరు అక్రమార్కులు, కొందరు కాంట్రాక్టర్ల జేబులు నిండుతున్నాయే తప్ప ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. వేసిన కొన్ని నెలలకే రోడ్లు అద్వాన్నంగా తయారవడంతో వాటిపై రాకపోకల్ని సాగిస్తున్న ప్రజలు గుంతలరోడ్లపై ప్రయాణం సాగిస్తూ ప్రమాదాల బారినపడడం లేదా వెన్నెముక వంటి ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. అద్వాన్నపు రోడ్లతో అవస్థలు పడుతున్న ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు చివరకు కార్యాలయాల్లో ప్రజలతోపాటు కాంట్రాక్టర్లకు అందుబాటులో ఉండడంలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో చిత్తం వచ్చినప్పుడు కార్యాలయాలకు వస్తూ, పోతుండడంతో ఆయా పనుల కోసం వచ్చే ప్రజలతోపాటు కాంట్రాక్టర్లు విసిగిపోతున్నారు. ఎప్పుడు చూసినా తనిఖీలు, సమావేశాల పేరుతో కార్యాలయాలలో అందుబాటులో ఉండని అధికారులు కార్యాలయాలకు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎస్ఈ కార్యాలయం, డీఇల కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తోన్న అధికారుల అండదండలతో కొందరు, ఏఇలు, వర్క్ఇన్స్‌పెక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వసూళ్ళ పర్వానికి తెరలేపారు. ఎస్ఇ, డీఇల కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న కొందరు అధికారులు కుమ్మక్కై పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతూ కోట్ల అక్రమాస్తులు కూడబెడుతున్నా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టి సారించడంలేదనే అభిప్రాయాలు వ్యక్త్తం అవుతున్నాయి.

## గచ్చిబౌలి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

**-శేరిలింగంపల్లిలో పర్యటించిన గ్రేటర్ కమిషనర్**

**గచ్చిబౌలి, జూలై 9 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలిలో చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ అమ్రాపాలి అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో మంగళవారం జీహెచ్ఎంసీ కమీషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి చౌరస్తా వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు ముందుకు సాగడం కోసం భూసేకరణ పనులను వేగవంతం చేయాలని, సేకరించాల్సిన ఆస్థుల యజమానులకు టిడిఆర్ లేదా నగదు రూపంలో పరిహారం అందజేసే ప్రక్రియను ముమ్మరం చేయాలని ఆదేశించారు. అనంతరం త్రిపుల్ ఐటి జంక్షన్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జ్, మజీద్‌బండల్లో కమీషనర్ అమ్రాపాలి పర్యటించారు. ఈ ప్రాంతాల్లో జంక్షన్ల అభివృద్ధి, ఫ్రీలెఫ్ట్‌ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పలు విభాగాలతో సమన్వయం చేసుకుంటూ కూడళ్లను సుందరీకరించాలని సూచించారు. కొత్త ప్రాజెక్టులకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. మజీద్‌బండ, గచ్చిబౌలి రోడ్డు విస్తరణలో భాగంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐటి కారిడార్ ప్రాంతంలో సుందరీకరణ పనులు, రహదారి విస్తరణ పనులు వేగంగా జరుపాలని స్పష్టం చేశారు. కమీషనర్‌తో పాటు వెస్ట్‌జోన్ జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌డిపి సిఈ దేవానంద్, ప్రాజెక్టు విభాగం అధికారులు, పలు విభాగాల అధికారులు ఉన్నారు.



గచ్చిబౌలి ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న గ్రేటర్ కమీషనర్ అమ్రాపాలి

## ముజ్రా చిందులు ...రేవ్ పార్టీలు

- -శివార్లలో పేట్రేగుతున్న విష సంస్కృతి
- -పబ్బుల్లా మారుతున్న ఫాంహౌజ్‌లు,రిసార్టులు
- -పార్టీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు
- -నగరంలో ఆంక్షలు విధిస్తుండటంతో అటువైపు



**హైదరాబాద్, జూలై 9,ప్రభాతవార్త:**

జంట నగరాల్లోని శివారు ప్రాంతాలు అసాంఘీలక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. రేవ్ పార్టీలు,బర్త్‌డే ,బ్యాచిలర్ పార్టీల పేరిట కొందరు యువతీయువకులు విష సంస్కృతికి తెర తీస్తున్నారు.సంపన్న కుటుంబాలకు చెందిన యువతీ యువకులే ఈవిషసంస్కృతికి తెరలేపుతున్నట్లు తెలుస్తుంది.ఇటీవల కాలంలో నగరంలో పబ్‌లు, హుక్కాసెంటర్‌లపై ,పేకాట స్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో వీరు శివార్లవైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. రాత్రింబవళ్లు చిత్తుగా మద్యం తాగుతూ అశ్లీల నృత్యాలతో శివార్లు శివాలెత్తుతున్నట్లు తెలుస్తుంది. తాజాగా హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లో ఓ రిసార్ట్స్‌లో గత అర్ధరాత్రి అసభ్యకర పార్టీ ఘనట వెలుగులోకి వచ్చింది. మొయినాబాద్‌లోని ఓఫోమ్‌హౌజ్‌లో ముజ్రాపార్టీ నిర్వహిస్తున్నారని, అమ్మాయిలతో నగ్నంగా డ్యాన్సులు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎస్‌వోటి పోలీసులు ఫామ్‌హౌజ్‌పై దాడి చేశారు. పార్టీలో పాల్గొన్న ఏడుగురు యువకులు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ముజ్రాపార్టీ కోసం యువతులను ఢిల్లీనుంచి తీసుకొచ్చారని చెప్పారు. అసభ్యనృత్యాలు, అర్థనగ్న డ్యాన్సులు చేస్తుండగా పట్టుకున్నామని తెలిపారు వారిని మొయినాబాద్ పోలీసులు అప్పగించాలని వెల్లడించారు. ముఖ్యంగా నగరశివారు ప్రాంతాల్లోని మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, శంషాబాద్, చేవెళ్ల, శామీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట్ ప్రాంతాల్లో ఫాంహౌజ్‌లు అధిక సంఖ్యలో ఉన్నాయి.ఇందులో కొన్ని రాత్రులు పబ్‌లుగా మారుతున్నాయి.సదరు ఫాంహౌజ్‌ల యజమానులు కాసుల కక్కుర్తి కారణంగా యువతరం పెడదారి పడుతోంది. ఫాంహౌజ్‌ల బుకింగ్ నుండి సకల సదుపాయాలు కల్పించేందుకు ప్యాకేజీలు ప్రకటిస్తూ అసాంఘీక కార్యకలాపాలకు ఆజ్యం పోస్తున్నారు.అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుండి వివిధ రకాల సంగీత వాయిద్యాలతో పాటు, యువతులను సైతం దిగుమతి చేస్తున్నారు. నగర శివార్లలో సాంఘీక కార్యకలాపాలలో పాలుపంచుకుంటున్న యువతీ యువకులు పట్టుబడిన సంఘటనలు అనేకం. కాగా కొన్ని కార్పొరేట్ సంస్థల వారు తమ టార్గెట్లను సాధించామన్న ఆనందంతో శివారు ప్రాంతాలలో పార్టీలపేరుతో అశ్లీల కార్య క్రమాలు నిర్వహించుకుంటున్నారు. నగరంలో అయితే పోలీసులు ఆంక్షలు ఉంటున్నాయని ఆయా సంస్థలు శివార్లలోని ఫాంహౌజ్‌లనే పార్టీజోన్‌లు ఎంచుకుని అన్ని విధాలా సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఇలాంటి పార్టీలు ఇటీవల కాలంలో ఎక్కువగా జరుగుతున్నా.. వేళ్లమీద లెక్కపెట్టేన్ని కేసులు మాత్రమే వెలుగులోకి వస్తుండటం విచారకరం. అసాంఘీక,అశ్లీల కార్యకలాపాలకు ఆయా ప్రాంతాల్లోని పోలీసులు కూడా తమదైన శైలిలో సహకరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రభుత్వం డీజెలను నగరంలో నిషేదించినా శివార్లలో ఇంకా మారుమోగుతునే ఉన్నాయి.

**నామమాత్రపు దాడులు..**

ఫాంహౌజ్‌లు,రిసార్ట్‌లలో అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా నిత్యం నిఘా వేయాల్సిన స్థానిక పోలీసులు నామమాత్రపు దాడులు నిర్వహిస్తూ నెల నెల మామూళ్లు అందుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అధిక మొత్తంలో మామూళ్లు చెల్లించిన వారికి,బడాబాబుల పార్టీలకు పోలీసులను రక్షణ కవచంగా ఉంచుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. యువతీ యువకులు రేవ్‌పార్టీల పేరిట పెడదారి పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జంట నగరాల్లో నిత్యం కార్డెన్ సెర్చ్‌నిర్వహిస్తున్న పోలీసులు శివారు ప్రాంతాలపై దృష్టి సారించకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారాంతపు రోజులు శని,ఆది వారాల్లో ఫాంహౌజ్‌లు, గెస్ట్‌హౌజ్‌లు అశ్లీల కార్యక్రమాలతో కిటకిటలాడుతున్నాయి. ఈతరహా పార్టీలపై ఉక్కుపాదం మోపి విషసంస్కృతిని అడ్డుకోవాలని పోలీసులను కోరుతున్నారు.

## చదువుతోనే సమాజంలో గుర్తింపు

**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, బిసిఅధికారి ఆశన్న తదితరులు

**హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త:**

చదవుతోనే సమాజంలో మంచి గుర్తింపు గౌరవం లభిస్తాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ అంబర్‌పేట్ ప్రభుత్వ బిసి కళాశాల బాలుర వసతిగృహంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి జీవితంలో రాణించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని తాను కూడా తెలంగాణ బిడ్డనేనన్నారు. మారుమూల గ్రామం మెట్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలో చదివి అనంతరం జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి జిల్లా కలెక్టర్ అయ్యానని తెలిపారు. బాగా చదవడంతో మీరు కూడా ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు చదువును కష్టంగా భావించకుండా ఇష్టంగా చదివినప్పుడే మంచి ర్యాంకులు సాధిస్తారని అన్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. వసతి గృహంలో మెను ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సంరక్షకురాలిని సూచించారు. ఈసందర్భంగా జిల్లా బిసి అభివృద్ధి అధికారి ఆశన్న విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

## మహిళ ఆత్మహత్య..

**పేట్ బషీరాబాద్, జూలై 9, ప్రభాతవార్త :** మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బినా రియాజ్ సమ్నాని (33) బ్యూటీషియన్‌గా పనిచేస్తు కొంపల్లిలోని గార్డెన్ హౌసింగ్ సొసైటీలో నివాసం ఉంటుంది. గత కొన్ని రోజుల నుండి అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది మంగళవారం ఉదయం 3.30 గంటల ప్రాంతంలో తాను నివాసం ఉంటున్న ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో దాడి...ముగ్గురు యువకుల రిమాండ్

**మెహిదీపట్నం, జులై 9, ప్రభాతవార్త :**

మద్యంలో మత్తులో యువకుడిపై ముగ్గురు యువకులు దాడి చేసి కటకటాల పాలైన సంఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భైరి రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కార్వాన్ హీరానగర్‌కు చెందిన నరేష్ ఫైనాన్స్ వ్యాపారి, అదే ప్రాంతానికి చెందిన అశోక్ సివిల్ కాంట్రాక్టర్. తన అవసారాల నిమిత్తం నరేష్ కొన్ని నెలల క్రితం అశోక్ వద్ద డబ్బులు తీసుకొని తిరిగి చెల్లిండం లేదు. పదేపదే నరేష్ తన డబ్బులు తనకు చెల్లించాలని అశోక్‌ను అడగడంతో విసుగెత్తిన అశోక్ లక్ష్మీనగర్ చౌరస్తాలోని వి5 బార్‌కురా అక్కడ డబ్బులు తిరిగి చెల్లిస్తాను అన్నాడు. దీంతో నరేష్ తన స్నేహితుడైన మిన్నిని వెంట తీసుకొని వి5 బార్‌కు వెల్లగా అక్కడ అశోక్ తమ్ముడైన హరీష్, స్నేహితుడైన రాజేష్‌లు మద్యం సేవిస్తూ ఉన్నారు. నరేష్ తన డబ్బులు తనకు ఇవ్వాలను అశోక్‌ను అడగడంతో మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. అక్కడ నుంచి బయటకు వచ్చిన ఇరువురు గుడిమల్కాపూర్ పూలమార్కెట్ వద్దకు రాగానే మరొకసారి గొడవకు దిగారు. అక్కడి నుంచి ఇనువురు హీరానగర్‌కు చేరొని మరోమారు గొడవకుదిగడంతో అశోక్ స్నేహితుడైన రాజేష్ తన వెంట తీసుకొచ్చిన కత్తితో నరేష్ మీదకు పోగా పక్కనే ఉన్న మిన్ని మధ్యకు వచ్చాడు. దీంతో కత్తి మిన్ని చేతికి తగిలి గాయం అయింది. నరేష్ పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించారు.

## అక్రమ అంతస్తులపై టౌన్‌ప్లానింగ్ ఉక్కుపాదం

**-అయ్యప్పసొసైటీలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత**



అయ్యప్పసొసైటీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

**శేరిలింగంపల్లి, జూలై 9 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌పరిధిలోని చందానగర్ సర్కిల్‌లోని మాదాపూర్ డివిజన్ అయ్యప్పసొసైటీలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తు ల భవంతులపై పెద్దఎత్తున జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందటం తో టౌన్‌ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం అయ్యప్ప సొసైటీలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు.. ఫిల్లర్లను తొలగించటంతో పాటు స్లాబ్‌లను కూడా నేలమట్టం చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలమ మేరకు శేరిలింగంపల్లి వెస్ట్‌జోనల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో పెద్దఎత్తున యంత్రాంగం తెల్లవారు జాము నుంచే అక్రమ కట్టడాలను పూర్తిస్థాయిలో కూల్చివేశారు. అనుమతులు లేకుండా ఏలాంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేతలు తథ్యమని అధికారులు స్పష్టం చేశారు. గడచిన వారం రోజులుగా అయ్యప్ప సొసైటీలో ఈ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కొన్ని నిర్మానాలు ప్రాథమిక దశలో ఉన్నప్పుడే వాటిని కూల్చివేస్తున్నారు. ఏళ్ల తలబడి ఇక్కడ అక్రమ కట్టడాలు నిరాటకంగా కొనసాగుతున్నాయి. వాటిపై అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించటంతో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఖానామెట్‌లో సర్వే ఆఫ్ ఇండియాలో ఓపెన్ ప్లాట్, అయ్యప్పసొసైటీలోని పలు ప్లాట్ నంబర్లలలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఇకపై ఏలాంటి అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని టౌన్‌ప్లానింగ్ అధికారులు తేల్చిచెప్పారు. కూల్చివేతలను వేగవంతం చేయాలని ఆదేశించటం జరిగిందని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

## శ్రీ లక్ష్మీ ఇండస్ట్రీస్‌లో అగ్ని ప్రమాదం..



**పేట్ బషీరాబాద్, జూలై 9, ప్రభాతవార్త**

శ్రీ లక్ష్మీ ఇండస్ట్రీస్ జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్ సుభాష్‌నగర్‌లో మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు ఈ విషయాన్ని కంపెనీ ఎంప్లాయి అయిన శ్రీధర్‌బాబుకు తెలుపగా వెంటనే అతను సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో శ్రీధర్‌బాబు షటర్ ముట్టుకోగా కరెంట్ షాక్ తగినట్టు తెలిపాడు. వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారాన్ని అందించగా వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బల్కంపేట బోనాల ఉత్సవాలల్లో పాల్గొన్న బిజెపి నాయకులు



కనక దుర్గమ్మదేవాలయంలో జరిగిన బల్కంపేట బోనాల ఉత్సవాలల్లో బిజెపి నాయకులు గోవింద్‌రాఠి తదితరులు

**గన్‌ఫౌండ్రి,జూలై9 ప్రభాతవార్త:** శాంతి స్వరూపిణిగా అదిపరా శక్తిగా పురానాపూల్ స్వామి వివేకనందనగర్ బస్తీలో కనకదుర్గమ్మగా వెలసి ఆలయంలో నాలుగవ సంవత్సరం ఎస్.కె.వై యూత్ అసోసియేషన్ ఆద్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ తల్లి బోనాల పండుగను అంగరంగవైభవంగా నిర్వహించారు.ఆషాడ మాసంబోనాల ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివివేకనంద నగర్ కనకదుర్గ దేవాలయంలో అమ్మవారికి తెల్లవారుజామున అభిషేకం,పూజలు నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేకంగా నెలకొల్పిన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు వద్ద బోనాలను ఆలకరించారు.అమ్మవారి బ్యాండు మేళాల మధ్య అమ్మవారికి తొట్టెలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరుగంటలకు అమ్మవారి తొట్టెల,పోతరాజుల నృత్యాల మధ్య బల్కంపేట అమ్మవారి దేవాలయానికి ఊరేగింపుగా బయలు దేరి వెళ్లారు.అంతకుముందు బిజెపి నాయకులు గోవింద్ రాఠి,బిఆర్ఎస్ నాయకులు ముత్యాల గోవింద్‌రాజు,ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్,ఎంఆర్‌పిఎస్ నాయకులు దండు సురేందర్ మాదిగ, పెంజర్లశ్యామ్‌కుమార్,ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.కె.వై ప్రతినిధులు మిర్చిచిన్న,కొన్నింటి సుధాకర్, భరత్, సతీష్, పి.కిరణ్,డి.ఆకాష్,వి.ఎస్.ఆర్,అరుణ్,నాగేందర్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.వందలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు.

## బిజెపి,కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలి : సంజీవ్



పికెట్ చౌరస్తాలో విలేకర్లతో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమ కారుల సంఘం అధ్యక్షుడు సంజీవ్ తదితరులు

**కంటోన్మెంట్,జూలై 9 ప్రభాతవార్త:** కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని, వద్దని తమ స్వార్ధ ప్రయోజనాల కోసం బిజెపి, కాంగ్రెస్ పార్టీలు నాటకమాడుతున్నాయని తెలంగాణ ఉద్యమ కారుల అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, పోలీస్‌లు ఉద్యమ కారుడు ఎం.సంజీవ్ ఆరోపించారు. మంగళవారం పికెట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటుందని, దాంతో లోకల్ ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రయోజనం కలుగుతుందని, విలీనం జరుగకపోతే కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి మేలు జరుగుతుందన్నారు. కంటోన్మెంట్‌లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని పట్టించుకోవడంలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమైయ్యాయన్నారు. కంటోన్మెంట్‌పై రేవంత్ రెడ్డికి ప్రేమ ఉంటే కొడంగల్ అభివృద్ధికి రూ.500 కోట్లు కెటాయించినట్లుగా కంటోన్మెంట్‌కు అదే తరహాలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి కూడా రక్షణ శాఖ నుంచి ప్రత్యేక నిధులు మల్లించి ప్రజా సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారులు రొట్టెల సునీల్, యు.రాజేందర్, జోడి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



7వ వార్డు ఓల్డ్ గాంధీ నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,జూలై 9 ప్రభాతవార్త:** మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ, వృత్తి నైపుణయంలో ప్రతిభకనబర్చాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. హైదరాబాద్ ఆర్చ్ దయాసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ చైర్మన్ కార్డినల్ పూల ఆంథోనీ ఆధ్వర్యంలో మంగళవారం 7వ వార్డులోని ఓల్డ్ గాంధీ నగర్‌లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మదన్ ఆంథోనీ, కాంగ్రెస్ యువ నాయకులు శ్యాంసన్, ప్రదీప్, చోటు, రంజిత్, భవానీ, జోషెఫ్, సన్నీ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారు చల్లగా చూడాలి : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్,జూలై 9 ప్రభాతవార్త:** అమ్మవారి ఆశీసులు ఉంటేనే ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఉంటారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. 1వ వార్డు బాపూజీ నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయం 15వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పార్టీ నుండి ముత్తిరెడ్డి ఫణీంద్ర నాయుడు సస్పెన్షన్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 9, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్తిరెడ్డి ఫణీంద్ర నాయుడును కాంగ్రెస్ పార్టీ నుంచి మంగళవారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఉత్తర్వులు జారి చేశారు. కెపిహెచ్‌బి కాలనీ ఎల్ఐజి 121 ఫ్లాట్ ఓనర్స్ తమ గృహాలను పునర్నిర్మిస్తుండగా ఫణీంద్ర అక్కడికి వెళ్లి వారిని 20వేల రూపాయలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. వారు ఈవిషయమై కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్‌కి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన విచారణ చేయగా నిజమేనని తెలవడంతో ఆయన సూచన మేరకు జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ఫణీంద్ర నాయుడును సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న నిర్మాణాల విషయంలో సొంత పార్టీ వాళ్లు సైతం డబ్బులు డిమాండ్ చేస్తే ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు.

## 'టీవీ యాంకర్స్'కు పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త:** జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'టీవీ యాంకర్స్'కు పురస్కారాలను ప్రదానం చేయబోతున్నట్లు ఫౌండేషన్ అధినేత గుదిబండి వెంకటరెడ్డి వివరించారు. సంస్థ ఇరవై రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 8న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ టీవీ ఛానళ్ళకు చెందిన యాంకర్లకు ఈ పురస్కారాలను ఇస్తున్నామని, పారిశ్రామికవేత్త డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వసలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై అందిస్తారన్నారు. సభను దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ ప్రారంభిస్తారని, కార్యక్రమంలో సౌత్ జోన్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, విఆర్‌యు లాబోరేటరీస్ ఎండి ఆర్.శ్యామ్‌సుందర్, లఘుచిత్ర నిర్మాత జమలాపురం రాధాకృష్ణ, గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ చైర్మన్ గిడుగు కాంతికృష్ణ,సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జి.శ్రీకాంత్ పాల్గొంటారన్నారు.

# పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయండి..

**-కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు భేటి..**

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 9, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి కోరారు. మంగళవారం ఉదయం కూకట్‌పల్లి నియోజకవర్గం కార్పొరేటర్లతో కలిసి జోనల్ కమీషనర్ కార్యాలయంలో అపూర్వ చౌహాన్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలోని పరిస్థితులను వివరించారు. వర్షాకాలంలో నెలకొనే సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా జోనల్ కమీషనర్‌కు సూచించారు. చెరువులు, కుంటలలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడం ద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు మట్టి తొలగించడం ద్వారా నాలాలు పొంగిపొర్లకుండా మురుగునీరు పరిసర కాలనీలు, బస్తీలను ముంచెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూకట్‌పల్లి ముసాపేట సర్కిళ్లకు చెందిన అధికారులు ఎవరైనా పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే బదిలీ చేసి కొత్తగా సమర్థవంతమైన అధికారులను నియమించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, ముసాపేట, అల్లాపూర్, బాలాజీనగర్, కెపిహెచ్‌బి కాలనీ, కూకట్‌పల్లి డివిజన్ల పరిధిలో నెలకొన్న సమస్యలపై కార్పొరేటర్లు ముద్దం నర్సింహ్మాయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, సబీహా గౌసుద్దీన్, పగుడాల శిరీషబాబురావు, మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



జోనల్ కమీషనర్‌తో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

## నెల్లుట్ల జ్యోతిష వేణుగోపాల్‌రావుకు రత్నపురస్కారం

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 9, ప్రభాతవార్త**

కెపిహెచ్‌బి కాలనీకి చెందిన ప్రముఖ జ్యోతిష్య సిద్ధాంతి నెల్లుట్ల వేణు గోపాలరావుకి జ్యోతిష్య రత్న అవార్డు ప్రధానం చేశారు. ఇటీవల నగరంలో గల హబ్సిగూడలోని కినారా గ్రాండ్‌లో జరిగిన వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు జ్యోతిష్య విభాగంలో నెల్లుట్ల సేవలను కొనియాడారు. విశ్వ జ్యోతిష విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు దైవజ్ఞ శర్మ, పుచ్చా శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీకాంత శర్మ, ఎల్ఎస్ సిద్ధాంతి, పెండ్యాల సూర్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.

## చర్ల ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న కొలన్ తేజ శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్, జూలై 9, ప్రభాతవార్త**

ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని పురాతన దేవాలయం చర్ల ఎల్లమ్మ తల్లి వారి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, నాగరాజు యాదవ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూఎల్‌బినగర్ సంక్షేమానికి కట్టుబడి ముందడుగు : ప్రభాకర్‌గుప్తా

**కుత్బుల్లాపూర్, జూలై 9 ప్రభాతవార్త**

రాజకీయాలకు అతీతంగా కాలనీ సంక్షేమానికి నిరంతరం కట్టుబడి పనిచేస్తానని న్యూ ఎల్.బి.నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు ప్రభాకర్‌గుప్తా హామీఇచ్చారు. మంగళవారం చింతల్ డివిజన్ న్యూ లాల్‌బహదూర్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులుగా ఆయన ఎన్నిక కావడంతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నందున ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులతోపాటు కార్పొరేటర్ రావుల శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌గుప్తా మాట్లాడుతూ కాలనీ సంక్షేమమే ధ్యేయంగా కృషిచేస్తానని ప్రమాణంచేశారు. కాలనీలో మౌళికసదుపాయాల కల్పనకు సంక్షేమ సంఘ ప్రతినిధులతో కలిసి మెలసి సమస్యల పరిష్కారానికి యత్నిస్తామని తెలిపారు. కాలనీ నియమ, నిబంధలను అనుగుణంగా ప్రత్యక్ష శ్రద్ద, అమూల్య సమయం, అవసరమైన విషయాలతో పాల్గొని అందరికీ ఆమోదయోగ్యంగా కృషిచేస్తానని ప్రభాకర్‌గుప్తా హామీఇచ్చారు. అధ్యక్షులుగా అకుల ప్రభాకర్‌గుప్తా, ప్రధానక్యాదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాదికారిగా బాలస్వామి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా జమ్ముల తులసీరాం, ఉపాధ్యక్షులుగా జి.రమేష్, గద్దమీది భరత్‌కుమార్ కురుమ, ఉమాశంకర్, అనిల్ కుమార్, షిండే, సంయుక్త కోశాధికారిగా పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా యాదవరెడ్డి, నర్సింహ్మ, సుధాకర్‌రెడ్డి, సాయిరెడ్డిలు కార్పొరేటర్ రావుల శేషగిరిరావు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సంక్షేమ సంఘ ప్రతినిధులు పోచమ్మ ఎల్లమ్మ గుడిని దర్శించుకున్నారు.

## వెనకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామకృష్ణగౌడ్



రామకృష్ణగౌడ్‌కు నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

**హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త:**

తెలంగాణ వెనకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఫిలించాంబర్ చైర్మన్, నిర్మాత, డిస్ట్రీబ్యూటర్ ప్రతాని రామకృష్ణగౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ తెలుగు రాష్ట్రాల కౌన్సిల్ అధ్యక్షులుగా కొప్పువారి భాస్కర్‌రావు, ఉపాధ్యక్షులుగా గురురాజ్, వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా ప్రముఖ దర్శకుడు సముద్ర, రాజు, కార్యదర్శులుగా ఆకుల బాలకృష్ణ, పొలాస వాసు, భక్తవత్సలం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేశెట్టి శివకుమార్, నగర గౌరవ అధ్యక్షులుగా ఆర్వీ మహేందర్ కుమార్ నియమితులయ్యారు. ఈసందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరవైశాతం జనాభా కలిగిన వెనకబడిన తరగతుల వారు ఇప్పటికీ అధికారానికి దూరంగానే ఉన్నారని , బిసిల హక్కు కోసం ఇంకా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. రాష్ట్ర జనాభాలో అగ్రపీఠం బిసిలదే ఐనా , బిసిల హక్కుల కోసం నేటికీ అడుక్కోవాల్సిన దుస్థితి మారలేదన్నారు. బిసిల సాధికారత కోసం, సంఘంఆశయాలను నెరవేర్చటం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 50సీట్లు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. త్వరలోనే గ్రామ, మండల జిల్లా స్థాయి కమిటీలు వేస్తామని తెలిపారు. డాక్టర్ కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ బిసిలు అందరూ రాజకీయంగా చైతన్యం కావాలని ,త్వరలోనే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమసత్తా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

## కొండా విజయ్‌కు ప్రతిష్టాత్మక లయన్స్ ప్రశంసాపత్రం

**శేరిలింగంపల్లి,జూలై 9 ప్రభాతవార్త**

చందానగర్‌కు చెందిన లయన్ కొండా విజయ్‌కు అంతర్జాతీయ లయన్స్ అధ్యక్షుడి నుంచి ప్రతిష్టాత్మకమైన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. లయన్స్ క్లబ్‌లో తనదైన సేవలను అందిస్తున్న సందర్భంగా ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబూరావు చేతుల మీదుగా కొండా విజయ్ ప్రశంసా పత్రాన్ని పొందారు. లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ నుంచి లయన్ కొండా విజయ్ ప్రశంసాపత్రం పొందటంపై పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## తల్లిదండ్రులను గౌరవించడం అంటే వారి అభిరుచికి అనుగుణంగా నడుచుకోటమే

**- ప్రఖ్యాత సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్**

**చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త:** తల్లిదండ్రులను గౌరవించడం అంటే వారి అభిరుచికి అనుగుణంగా నడుచుకోటమే నని ప్రఖ్యాత సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. వినయ్ తండ్రి పుట్టిన రోజును ఆయన రాసిన సంపుటిల ఆవిష్కరణలతో పాటు సంగీత విభావరి నిర్వహించి తన ప్రేమను ప్రకటించారని అభినందించారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో వాగ్దేవి ఆర్ట్స్ నిర్వహణలో సంగీత, సాహిత్య సమలంకృతే పేరుతో జరిగిన కార్యక్రమంలో వినయ్‌తో కలిసి అనూష, కృష్ణవేణి, మానస, ప్రశాంతి, వెంకీ, భరత్ తదితరులు నేటి, నాటి పాటలు మధురంగా ఆలపించారు. తమ్మినేని అక్కిరాజు రచించిన 'అక్కిరాజు కథల సంపుటి' లను ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించి ప్రసంగించారు. పాటపాడే విధానం కాక వినేవారి హృదయానికి హత్తుకునే లక్షణం ఉండాలన్నారు. 'అక్కిరాజు కవితా సంపుటి'ని ప్రముఖ సాహితీవేత్త, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. పుట్టినరోజు జరుపుకునే పద్దతి వల్ల వారి వక్తృత్వం బయటపడుతుందన్నారు. అక్కిరాజు తన పుట్టిన రోజు తన రచనలు ఆవిష్కరణలతో జరుపుకునే గొప్ప సంప్రదాయాన్ని ఆయనకు సాహిత్యంపై ఉన్న అభిమానం చాటారు. కవితాసంపుటిలోని కవితలు, కమ్యునిజం ప్రభవంతో రాశారని, వర్గవిభేదాలు ప్రస్తావించారన్నారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఫిలిం ప్రొడ్యుసర్ మురళీధర్, గిడుగు కాంతి కృష్ణ, గాయకుడు వెంకటరావు, ఎల్‌పీరావులకు 'కళాసేవక్' పురస్కారాలను అందించి గౌరవించారు. స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, గాయకుడు రేణుక తదితరులు పాల్గొనగా వినయ్ స్వాగతం కలుకగా యోగిత అక్కిరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

## లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరిస్తాం

**-కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణిరెడ్డి**



రోహిణిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

**సికింద్రాబాద్, జూలై 9 ప్రభాతవార్త:** జిల్లాల పునర్విభజన విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కమిటీ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణిరెడ్డి తెలిపారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కమిటీ సభ్యులు డాక్టర్ రోహిణిరెడ్డిని కలిసి లష్కర్ జిల్లా ఏర్పాటులో సహరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం రెండు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడడం వల్ల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, అందుకే పార్లమెంట్ వారీగా జిల్లాల ఏర్పాటు చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రి ఉన్నారని ఆయన తెలిపారు. ఈ విషయంలో అందరి అభిప్రాయాలు తీసుకునేందుకు జ్యూడిషల్ కమిటీ వేయాలని, తద్వారా మాత్రమే జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరుగుతుందని ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో కూడా వెల్లడించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పార్టీ వ్యవస్థ నిర్మాణంలో ఖైరతాబాద్ జిల్లాగా సికింద్రాబాద్ జిల్లా విభజన గతంలో జరిగిందని ఆయన తెలిపారు. లష్కర్ జిల్లా ఏర్పాటు విషయంలో తనవంతు కృషి చేస్తానని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతనని రోహిణిరెడ్డి హామీ ఇచ్చారు. రోహిణి రెడ్డిని కలిసిన వారిలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, లష్కర్ జిల్లా సాధన సమితి కమిటీ సభ్యులు బాలరాజ్‌యాదవ్, జగదీష్‌గౌడ్, శైలేందర్, సునీల్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, అశోక్ చారి, దీపు తదితరులు పాల్గొన్నారు.

## జీవో ప్రకారం వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి



ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావును కలిసిన తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్

**చిక్కడపల్లి, జూలై 9 ప్రభాతవార్త:** జీవో నెంబరు 317 ప్రకారం వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ కోరారు.మంగళవారం తెలంగాణ ప్రభుత్వ ముఖ్యసలహాదారు హర్కర వేణుగోపాలరావును కలిసి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను, పదోన్నతులను, ముఖ్యంగా వ్యవసాయ అధికారులకు వాహన సౌకర్యాలు, హెల్త్‌కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. వేణుగోపాలరావును కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కాలనీలో వన మహోత్సవం

**-పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి**

**గచ్చిబౌలి, జూలై 9 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, శేరిలింగంపల్లి డిప్యూటీ కమీషనర్ రంజిత్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కాలనీలో మొక్కలు నాటడం ద్వారా కాలనీలు పచ్చని మణిహారంగా మారుతాయని అన్నారు. ప్రతి కాలనీలో వన మహోత్సవాలు నిర్వహించాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచేందుకు కాలనీ వాసులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కెసిఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చారని అన్నారు. ప్రతి సంవత్సరం కోట్లాది మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడంతో నేడు కొన్ని ప్రాంతాలు పచ్చటి మణిహారంగా మారాయని అన్నారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ భావి తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను స్థానికులు స్వచ్ఛందంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో యుబిడి డిప్యూటీ డైరెక్టర్ ఆనీల్, మేనేజర్ విక్రమ్‌చంద్ర, కాలనీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, కోశాదికారి కైలాష్‌లతో పాటు సైదిరెడ్డి, సురేందర్, నరసింహ నాయకులు తిరుపతి, జంగయ్యయాదవ్, సత్యానారాయణ, శేఖర్, ప్రసాద్, సునీల్, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

## 14నుంచి "సమగ్ర కులగణన సాధన యాత్ర" : జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో సమగ్రకులగణనను చేపట్టి బిసి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 14నుంచి 31వరకు 17రోజులపాటు పది జిల్లాల్లో "సమగ్ర కులగణన సాధన యాత్ర" చేపడుతున్నట్లు బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి కులసంఘా జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్ నేతృత్వంలో బిసికుల సంఘాల మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాజుల మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బిసిలకు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతంకు బిసి రిజర్వేషన్లను పెంచుతామని స్పష్టమైన హామీతో బిసి డిక్లరేషన్ చేసిందన్నారు. ఈనేపథ్యంలో బిసి డిక్లరేషన్‌ను ప్రభుత్వానికి గుర్తుచేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బిసి డిక్లరేషన్ ప్రభుత్వానికి గుర్తుచేస్తూ ఒత్తిడి పెంచడానికి ఈయాత్ర ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈసమగ్ర కులగణన యాత్ర కామారెడ్డి నుంచి మొదలుకుని 10జిల్లాల్లో 17రోజులపాటు జరుగుతుందని ఈయాత్రలో సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఈనెల 31వ తారీఖున కరీంనగర్‌లో ముగింపు సభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కావున ఈకులగణన యాత్రలో బిసి మేధావులు, కులసంఘాలు, విద్యావంతులు ,ఉద్యోగులు ,విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బిసివిద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్ , బిసి జనసైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్‌గౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, బిసి సంఘాల నేతలు గూడూరు భాస్కర్, సమతా యాదవ్, సంధ్య, శ్యామల, రేణుక, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్,గణేష్‌చారి, విక్రంగౌడ్ తదితరులు

# అహం తగ్గించుకుంటేనే కేసులు సత్వర పరిష్కారం

**-హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్.నాగేష్ భీమపాక సూచన**



సమావేశంలో మాట్లాడుతున్న జస్టీస్. నాగేష్ భీమపాక

**సైఫాబాద్, జూలై 9 ప్రభాతవార్త:** మనిషిలో ఉన్న ఇగో (అహం భావం) వల్ల మనస్పర్థలు వచ్చి కోర్టులలో కేసులు పరిష్కారం కావడం లేదని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నాగేష్ భీమపాక చెప్పారు. ఆనేక అంశాలలో ఉన్న కేసులలో ఇగో తగ్గించుకుంటే కేసులు పరిష్కారమవుతాయన్నారు. 'సిఎడిఆర్‌టి' ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాల ట్రస్ట్ కోసం మండలి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మధ్యవర్తిత్వం చట్టం-2023 యొక్క సంగ్రహం అండ్ బార్, బెంచ్ పాత్రపై జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో న్యాయమూర్తి ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. కోర్టులలో ఇరు పార్టీలు రాజీకి వచ్చినప్పటికి న్యాయవాదులు సిద్ధంగా లేరని, దీంతో కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కోర్టులలో అందరూ రాత్రి భవళ్ళు 24 గంటల పాటు ఒక రోజుకు వంద కేసులు పరిష్కారించినప్పటికి ఇంకా 34 వేల కేసులు దేశ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉంటాయన్నారు. ఇగో అనేది మనిషి డిఎన్ఎలో ఉందన్నారు. మహా భారతంలో శ్రీకృష్ణభగవానుడు ఆనేక విషయాల్లో మధ్యవర్తిత్వం వహించినప్పటికి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సీనియర్ న్యాయవాది బి.నరసింహ శర్మ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కొన్ని కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం అవుతున్నాయని, సుప్రీంకోర్టు సైతం మధ్యవర్తిత్వం కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోర్టులు మధ్యవర్తిత్వంకు ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. సింగపూర్‌లో కూడా త్వరగా పరిష్కారమవుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ కోర్టుల్లో కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారించుకోవచ్చునని చెప్పారు. ఈ సమావేశానికి బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి అధ్యక్షత వహించగా తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ వైస్-ఛైర్మన్ కె.సునీల్‌గౌడ్, ప్రముఖ న్యాయవాదులు జూపూడి రంగారావు, దీపాక్ భట్టాచార్య, ఎ.వి.నరసింహారావు, తెలంగాణ హైకోర్టు జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగ్గల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి : కమిషనర్ అమ్రపాలి

**హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త:**

నగరంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట సంబంధిత అధికారులు సూచించారు. మంగళవారం బుద్ధభవన్‌లో రెవెన్యూ, శానిటేషన్,టౌన్‌ప్లానింగ్ ,ఫైనాన్స్ విభాగాల అధికారులతో ఆయా విభాగాల అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ..జిహెచ్ఎంసిలో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదాయ పెంపుకు ప్రణాళిక చేపట్టిన జిఐఎస్ సర్వేను నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. టౌన్‌ప్లానింగ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిపివిల ఎలిమినేషన్ ఏవిధ:గా చేయాలన్న దానిపై, నాలాల వరద నీరు నిలువకుండా ఫ్లోటింగ్ మెటీరియల్ వెను వెంటనే తొలగించే విషయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ సవ్వంగా జరగాలని, జిహెచ్ఎంసిలోగల అన్ని పబ్లిక్ టాయిలెట్స్‌ను వినియోగంలోకి తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్‌పాటిల్, అపూర్వ్ చౌహాన్, రవికిరణ్, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, అడిషనల్ కమిషనర్ స్నేహ షబరీష్, గీత రాధిక, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్‌రెడ్డి, టాక్స్ వాల్యూవేషన్ అధికారి మహేష్ కులకర్ణి ,ఫైనాన్స్ అడ్వైజర్ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్లు,వివిధ విభాగాల అధికారులతో సమావేశమైన కమిషనర్ అమ్రపాలి

## డీఎస్సీని వాయిదా వేయాలి



ఆర్ట్స్ కాలేజ్ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

**తార్నాక, జూలై 9 ప్రభాతవార్త:** డీఎస్సీ నిరుద్యోగులు రెండు నెలలుగా వాయిదా కోసం చేపడుతున్న ధర్నాకు బీఆర్ఎస్వీ మద్దతు పలికింది. డీఎస్సీ నిరుద్యోగులకు మద్దతుగా మంగళవారం ఒ.యూలో బీఆర్ఎస్వీ నాయకులు చేపట్టిన నిరసనలతో ఓ.యూ ఉద్రిక్తంగా మారింది. పలువురు ఆర్ట్స్‌కాలేజ్ వద్దకు చేరుకొని సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి సీఎం కు వ్యతిరేకంగా మాట్లాడారు. దీంతో పోలీసులు దిష్టిబొమ్మను దగ్ధం చేయకుండా అడ్డుకొని పలువురిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగబాలు మాట్లాడుతూ తక్షణమే డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. 60 రోజుల్లో 3 రకాల పరీక్షలు, 120 పుస్తకాలు, 30 రోజులు పరీక్షలు రాయడం రోబోకు కూడా సాధ్యంకాదన్నారు. ఉద్యోగాల కోసం ఉద్యమాలు వెను వెంటనే పరీక్షలు అనే సంకట స్థితిలో డీఎస్సీ నిరుద్యోగులు విపరీతమైన మానసిక ఒత్తిడితో ఉన్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని డీఎస్సీని ప్రభుత్వం వెంటనే వాయిదా వేయాలని తుంగబాలు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరత్‌తో పాటు పలువురు బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

## దళిత ఎస్సై కుల వివక్షతో మృతిచెందినా ప్రభుత్వ స్పందన కరవు

**-బొజ్జ యాదగిరి గుండె సంపత్**

**తార్నాక, జూలై 9 ప్రభాతవార్త:**

అశ్వరావు పేట దళిత ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ కుల వివక్షతో మృతిచెందినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేక పోవడం బాధకరమని దళిత జనసమితి రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంపత్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు నాచారంలో మాట్లాడుతూ గౌరవపోలీస్ వ్యవస్థలో అశ్వరావు పేట ఎస్సైగా పనిచేసిన శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కులవివక్షే కారణమని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వ్యవస్థలో అగ్రకులాల వారు చేస్తున్న అరాచకాలు నేటికి కొనసాగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేస్తుందని ఆరోపించారు. అగ్రకుల అధికారి వల్ల మృతి చెందిన దళిత ఎస్సైకి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా కంట్రోలో తప్పిందన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు హోంమంత్రిని నియమించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఎస్సై మృతికి భాధ్యత వహిస్తూ ఉపముఖ్యమంత్రి రాజినామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతి చెందిన ఎస్సై కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళిత పక్షపాతి అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ చేతల్లో చూపించడంలేదన్నారు. దళితుల అండతో గెలిచిన కాంగ్రెస్ దళితులపై జరుగుతున్న వివక్షపై స్పందించడంలేదన్నారు. ఎస్సై మృతిపై సీబిఐ ధర్యాప్తు చేయించి బాధితులకు న్యాయం చేయాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బావనపల్లి గంగాధర్, బీసీ నాయకులు ఎదునూరి సంపత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి : బలాల



విద్యాశాఖాధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జూలై 9 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యాశాఖాధికారులు, పాఠశాలల హెడ్‌మాస్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు అంశాల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి రాధా కృష్ణ, హెడ్‌మాస్టర్ విజయలక్ష్మి తదితరులతోపాటు నాయకులు సైపుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లోని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:** వరదనీటి కాలువ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీ నుంచి రాఘవేంద్ర కాలనీవరకు కొనసాగుతున్న వరదనీటి కాలువ పనులను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నీటి కాలువ పనుల్లో నిర్లక్ష్యం చూపరాదని, అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. పనుల్లో నాణ్యతలోపిస్తే శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, కాలనీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీవారాహిదేవి ఉత్సవాలు



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

**ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త:** శ్రీవారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తులకు మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆర్కేపురంలోని కుర్తాల పీఠం ఆదిపరాశక్తి శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఈనెల 6వ తేదీ నుంచి 14వ వరకు జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయంలో శ్రీసౌందర్యలహరి పారాయణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శ్రీవారాహి సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవికి విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, పారాయణం, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు దేవాలయం సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయినగర్‌నగర్ విద్యుత్‌కు అంతరాయం

**నేరెడ్‌మెట్, జూలై 9 ప్రభాతవార్త:** విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వాజ్‌పేయినగర్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఇ పేర్కొన్నారు. నేటి ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు రాఘవేంద్రనగర్, అమ్ముగూడ, సిబియన్ కాలనీ, వివేకానందపురం, మాతృపురి కాలనీ, భరణి కాలనీ, డిఫెన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

**మలక్‌పేట, జూలై 9 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తుందని బిజెపి కిసాన్ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు మడిగెల లక్ష్మారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రైతులకోసం పేర్కొన్న హామీలను నెరవేర్చాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలతో కలిసి సైదాబాద్ మండలతహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షల వ్యవసాయ రుణాన్ని బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేసారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఖరీఫ్, రబీ కలుపుకుని ఎకరాకు రూ. 15 వేల రూపాయల ఆర్థిక తోడ్పాటును అందించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, నాయకులు యాదగిరి సురేందర్, అశోక్‌రెడ్డి, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు



పథకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కోచ్ కృష్ణ

**మలక్‌పేట, జూలై 9 ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 2024 పోటీల్లో మలక్‌పేటకు చెందిన విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించి తమ సత్తాను చాటారు. ఇటీవల నగరంలోని ధూల్‌పేట మినీ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో కాచిగూడ రా కాంబాట్ స్టోర్స్ బ్రాంచ్‌కు చెందిన దేవాష్, విఘ్నేష్, జాన్, అజయ్, కృష్ణ, రణవీర్‌లు బంగారు పతకాలు, క్రిష్, ప్రభాత్, విశాల్, సాయి రజత పతకాలు, ఫారిద్ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ ఆదిమూల కృష్ణ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుఉ పాఠ్యాంశాలతోపాటు మార్షల్ ఆర్ట్స్‌ను కూడా నెరవేర్చుకుంటే తమను తాము రక్షించుకోవడానికి దోహద పడుతుందన్నారు.

## కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : ఎమ్మెల్యే బీఎల్ఆర్



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్ తదితరులు

**నాచారం, జూలై 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను నెరవేర్చాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారంకు చెందిన పలువురి లబ్ధిదారులకు శాధిముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను స్థానిక కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే బీఎల్ఆర్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారిలక్ష్మారెడ్డి మాట్లాడుతూ షాది ముభారక్, కళ్యాణ లక్ష్మి అర్హులందరికి గత ప్రభుత్వం ఇస్తున్న రూ. లక్ష 116తో పాటు తులం బంగారం కూడా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామి ఇచ్చారని ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సునిల్, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీసు శాఖ ముందంజ : ఎసిపి లక్ష్మీకాంత్‌రెడ్డి



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎసిపి లక్ష్మీకాంత్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:** బాధితులు పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీసు శాఖ ముందంజలో ఉందని మహేశ్వరం డివిజన్ ఎసిపి లక్ష్మీకాంత్‌రెడ్డి వెల్లడించారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పొగొట్టుకున్న, దొంగిలించబడిన సెల్‌ఫోన్లకు సంబంధించిన వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి రికవరీ చేసిన సుమారు రూ.5 లక్షల విలువ చేసే 25 విలువైన స్మార్ట్ సెల్‌ఫోన్లను మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ టి.భూపతి, డిఐ మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎసిపి చేతుల మీదుగా సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. అనంతరం ఎసిపి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ వల్ల సెల్‌ఫోన్ల రికవరీ సులభతరమైందని తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా బాధితులు గతంలో ఆశలు వదులుకొని సిమ్ బ్లాక్ చేసి కొత్త ఫోన్ కొనుక్కొనే వారనీ అయితే ప్రస్తుతం పెరిగిన టెక్నాలజీ వల్ల ఫోన్లకు సంబంధించి ఐఎంఇఐ నెంబర్లతో సిఇఐఆర్ అప్లికేషన్‌లో ఎంట్రీ చేసి దర్యాప్తు చేయడం ద్వారా సులభంగా ఫోన్లు రికవరీ అవుతున్నాయని ఆయన వివరించారు. కాగా సెల్‌ఫోన్ల రికవరీ కేసుల్లో ప్రతిభ చూపిన పోలీసులను ఎసిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రైం సిబ్బంది, సెల్‌ఫోన్ల రికవరీ చేసుకున్న వారు పాల్గొన్నారు.

## ఎంపీ ఈటెల రాజేందర్‌కు ఘన సత్కారం



ఎంపీ ఈటెల, ఎన్వీఎస్ఎస్‌లను సత్కరిస్తున్న భరత్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త:** మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించిన ఈటెల రాజేందర్‌ను మంగళవారం చిలకనగర్ డివిజన్ బిజెపి నేతలు ఘనంగా సత్కరించారు బిజెపి సీనియర్ నేత కంచర్ల భరత్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌లను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని కార్యకర్తలు ఏ సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు ఈ కార్యక్రమంలో చిలుకనగర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు కంచర్ల భరత్ రెడ్డి, గొనె శ్రీకాంత్, సతీష్‌కుమార్, రామరాజుయాదవ్, అశోక్ కుమార్, అజయ్‌గుప్తా, రాజేష్ తదితరులు బీజేపీ కార్యకర్తలు, వివిధ మోర్చా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు : సిఐ



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మీ మాధవి తదితరులు

**ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త:** కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు మంగళవారం ఉప్పల్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ లక్ష్మీ మాధవి, సిఐ సూర్య నాయక్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, పరిమితి మించి విద్యార్థులను తీసుకొని రావద్దని కోరారు. విద్యార్థుల రక్షణ ఇతర అంశాలపై ఆటో డ్రైవర్లు దృష్టి కేంద్రీకరించాలని ఒక క్రమ పద్ధతిలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## సమస్యలు తలెత్తకుండా చర్యలు : పవన్

**ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త:** కాలనీలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అవసర మైన చర్యలు తీసుకుంటామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మారుతినగర్ రోడ్‌నెంబర్ 63లో డ్రైనేజ్ సమస్యలను కార్పొరేటర్ పవన్‌కుమార్ పరిశీలించారు. దశాబ్దాల క్రితం నాటి డ్రైనేజ్ లైన్ వల్ల నిరంతరం డ్రైనేజీ మురుగునీరు పొంగి రోడ్లపైకి రావడం జరుగుతుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే జలమండలి అధికారులను సంప్రదించి గల్పర్ బండిని పంపించి డ్రైనేజిలైన్ శుభ్రం చేయాలని సూచించారు. డ్రైనేజ్ సమస్యలు తలెత్తకుండా సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పవన్‌కుమార్ ఏఈని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మూర్తి, సాయిమోహన్, శ్రీనివాసరావు, సతీష్, మనోహర్‌రావు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఎస్సై కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా : సిపి తరుణ్ జోషి



చనిపోయిన ఏఎస్సై రాజేందర్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సిపి తరుణ్‌జోషి

**నేరెడ్‌మెట్, జూలై 9 ప్రభాతవార్త :** రాచకొండ పోలిస్ కమీషనరేట్ పరిధిలోని ఆదిభట్ల పోలిస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌రెడ్డి గత నెల 23వ తేదీనా రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఆయన భార్య మమత, కుమారుడు సుజిత్‌లకు మంగళవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని పోలిస్ కమీషనరేట్ కార్యాలయంలో రాచకొండ పోలిస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి భద్రత, ఎక్స్‌గ్రేషియానుండి రావాల్సిన 7లక్షల 96వేల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుఉద్యోగం ఎంతో భాద్యతతో కూడిందని, వాటిలో ఉన్న ఇబ్బందులు, ఒడిదుడుకులను అధిగమించి పనిచేసే యోధుడే ఒక మంచి పోలీసని తెలిపారు. అంతేకాకుండా మరణించిన పోలీసు కుటుంబాలకు చెందిన వారికి త్వరగా పెన్షన్‌తో పాటు వారికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా: కార్పొరేటర్ కొప్పుల



సమస్యలపై సంఘ సభ్యులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:** కాలనీలలో సమస్యలను దశలవారిగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి హయత్‌నగర్ ప్రాంతం వీరభద్రకాలనీలోని స్మశానవాటికలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశానవాటికలోని పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని వెంటనే శుభ్రం చేయించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. వర్షాకాలం ఆరంభమయిన నేపథ్యంలో ప్రహారీ చుట్టూ ఉపయోగకరమైన మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానికులు చెత్తను వేయకుండా ప్రహారీగోడపై మెష్, ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు స్నానపు గదుల మరమ్మతులు, ప్రధాన గేటు ఏర్పాటుకు జోనల్ కమిషనర్‌తో మాట్లాడి నిధులను మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో హిందూమాదిగ స్మశానవాటిక సంఘ సభ్యులు సిహెచ్ బాబు రావు, ఎర్ర రామస్వామి, పారంద అంజయ్య, హరిబాబు, పారంద రమేష్, ఎర్రరవీందర్, పారందసాయి పాల్గొన్నారు.

## చైర్మన్ రామ్‌రెడ్డిని ఆలయ కమిటీ సత్కారం



చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డిని సన్మానిస్తున్న లింగాల నాగేశ్వరరావు

**ఎల్.బి.నగర్, జూలై 9 ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన మల్‌రెడ్డి రామ్‌రెడ్డిని మంగళవారం కొత్తపేట న్యూ మారుతినగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. దేవాలయం కమిటీ ప్రతినిధులు లింగాల నాగేశ్వర రావు, కామేశ్వరరావు, మల్లేశం, సుబ్బరెడ్డి తదితరులు పూలమాలవేసి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయం ప్రధాన అర్చకుడు గుండెపూడి సుధీర్‌శర్మ రామ్‌రెడ్డికి ఆశీర్వచనం చేశారు. తమ ఆలయాభివృద్ధికి సహకరించాలని ఆలయ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## గిరిజన హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్



డిటిడిఓ రామేశ్వరిదేవికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

**తుర్కయాంజాల్, జూలై 9 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనీ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిటిడిఓ రామేశ్వరి దేవికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులకు హాస్టల్లో నాణ్యమైన భోజనం, త్రాగునీరు అందించాలని, గ్రామీణ ప్రాంతాలనుండి ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారని వారికి నాణ్యమైన ఆహారం లేకపోతే చదువుకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేగాక హాస్టల్ వార్డెన్స్‌కి రెండు అంతకన్నా ఎక్కువ హాస్టల్లో ఇన్చార్జి ఇవ్వడం వల్ల విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై శ్రద్ధ వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. కడ్తల్, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవని, విద్యార్థులు రాత్రి సమయాలలో భయభ్రాంతులకు గురవుతున్నారని తెలియజేశారు. అదేవిధంగా అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలను నిర్మించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఈ నాయకులు గండికోట శివ వివేక్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఓబీసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఎం.తానాజీ పటేల్‌కు ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి నియామకపు పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం (ప్రభాతవార్త, ఎల్.బి.నగర్)

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

**ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త:** కళ్యాణలక్ష్మి, షాది ముభారక్‌పథకం ద్వారా లక్ష రూపాయల చెక్కుతోపాటు తులం బంగారం కూడా ఇస్తే బాగుండేదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా మంజూరైన చెక్కులను కార్పొరేటర్లు ఎం.రజితరెడ్డి, బన్నాల గీత, శాంతి, ప్రబుదాస్ దేవేందర్‌రెడ్డి తదితరులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా లక్ష 116 రూపాయలతో తులం బంగారం ఇవ్వాలన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. డిప్యూటి తహసిల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఉప్పల్ మండల పరిధిలో 141 మందికి చెక్కులు మంజూరయ్యాయని వారిని కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి.సుధ, జూనియర్ సహాయకులు అనంత రాములు, ఎ.నాగలక్ష్మి, ఎం.అలివేలు, ఎన్.లక్ష్మి, పివెంకన్న, బి.విజయలక్ష్మి, బాలకృష్ణ, జి-సత్యనారాయణ, సంజీవ పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో రాత్రి వేళ పోలీసుల తనిఖీలు : ఎసిపి చక్రపాణి

**ఉప్పల్, జూలై 9 ప్రభాతవార్త:** ఉప్పల్ భగాయత్ పరిధిలో వరుస నేరాలు జరుగుతున్నందున పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి ఆధ్వర్యంలో సీఐ ఎలక్షన్‌రెడ్డి ఇతర సిబ్బంది భగాయత్‌లోని పలుప్రాంతాల్లో చెకింగ్ చేపట్టారు. మల్కాజిరి ఎసిపి చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డితో పాటు ఒక ఆర్మూడ్ ప్లాటూన్ ఫోర్స్ తో రాత్రి 9గంటలనుండి 12గంటల వరకు ఉప్పల్, రామంతాపూర్ భగయత్‌లలో క్షుణ్ణంగా వాహన తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నేరాల నివారణకు పోలీసులు నిరంతరం తనిఖీలు చేపడతారని తెలిపారు. భగాయత్ పరిధిలో అనుమతి లేకుండా అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి సమాచారం ఉంటే పోలీసులకు చెప్పాలని కోరారు ఇకనుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఇక నుండి అనుమతులు లేకుండా ఎవరైనా మద్య రాత్రి వరకు షాపులు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటళ్లు, షాపులవారికి సూచించిన సమయంలో షాపులు బంద్ చేసుకోవాలని సూచించారు. అలా చేయని యెడల అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా హోటల్స్, షాపులు నిర్వహించిన, రాత్రి వేళల్లో ఎవరైన అనుమానస్పదంగా తిరిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల వస్తువుల పంపిణీ : మేయర్ పారిజాత



సరుకులను అందజేస్తున్న పారిజాత, శేఖర్, కమీషనర్, కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన పారిశుధ్య కార్మికులకు మంగళవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కమీషనర్ జి.రఘు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు కార్పొరేటర్లతో కలిసి పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు భీమిడి స్వప్న జంగారెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, డివిజన్ల ముఖ్య నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, సానిటనీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి: బిజెపి కిసాన్‌మోర్చా

**సరూర్‌నగర్, జూలై 9 ప్రభాతవార్త:** అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకుముందు రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల కిసాన్‌మోర్చా అధ్యక్షులు కళ్లెం లక్ష్మారెడ్డి, గోలి శ్రీనివాస్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు బిజెపి, కిసాన్‌మోర్చా నాయకులతో కలిసి బడంగ్‌పేట్‌లోని బాలాపూర్ ఎమ్మార్వో కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద రూ.15 వేలు, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని హామీలిచ్చిన కాంగ్రెస్ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, భీమ్‌రాజ్, నర్సింహ, వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్ర చారి, రాంగోపాల్, ప్రదీప్, వెంకటేశ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలి : కార్పొరేటర్ దర్పల్లి



పనులను పరిశీలిస్తున్న హేమంత్‌కేశవ్‌పాటిల్, ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 9 ప్రభాతవార్త:** సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌తో కలిసి మంగళవారం కార్పొరేటర్ ఎల్‌బినగర్‌లోని పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్బీనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, సిఎం రోడ్ వైపు ఉన్న ప్రబుత్వ పాఠశాలలకు రెండు గేట్లను ఏర్పాటు చేయాలని, పిల్లల భద్రత కొరకు సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మించాలని కమిషనర్ను కోరారు. మెట్రో సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ కొరకు, వాల్‌టువాల్ సక్రమమైన రోడ్డును నిర్మించడం, బోలార్డ్స్‌ను ఒక వైపుగా ఫిక్స్ చేయాలని, ఎల్‌బినగర్ జంక్షన్ చుట్టూ నాలుగు వైపులలో మరుగుదొడ్లు నిర్మించాలని జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలు త్వరగా పరిష్కారం చేసే విధంగా చొరవ చూపాలని కోరారు.